చిట్టి కథ

# చిట్కాయణం



— పెయ్యేటి భువనేశ్వరి

ఈమధ్య శ్యామలాంబగారికి వయసు పైబడ్డంతో మతి మరుపెక్కువైంది. అందువల్ల ఎన్నో అనర్థాలొస్తున్నాయి. గ్యాస్ కట్టేసి స్టవ్ వెలిగించబోయి, గ్యాస్ అయిపోయిందని కంగారుపడటం, పప్పులోనూ - కూరల్లోనూ నీళ్లు పొయ్యడం మర్చిపోయి స్టవ్ కెక్కించి మాడ్చేయడం, అతిగానో - తక్కువగానో అన్నం వండటం, పరధ్యాన్నంగా ఉప్పో, చింతపండో, కారమో ఎక్కువవెయ్యడం - లేదా అసలు వెయ్యడమే మర్చిపోవడం వంటివి వాటిలో కొన్ని ఉదాహరణలు మాత్రమే! అందుకే, వెంటనే కొడుక్కి పెళ్లి చేసేయ్యాలనుకుంది. తెలివైన కోడలు పిల్ల కోసం వెతకడం మెదలెట్టింది. ఆమె తను వెళ్లిన చోటల్లా, పెళ్లి కూతుళ్లని చిత్ర విచిత్రమైన ప్రశ్నలతో వేధించేది.

"పప్పులో ఉప్పెక్కువైతే ఏం చేస్తావమ్మాయ్?"

"పెరుగు పులవకుండా చేసేందుకు నీ ఐడియా ఏమిటి?"

"రాత్రి అన్నం పొద్దున్నకి మిగిల్తే పొరెయ్యకుండా వాడుకునేందుకు నువ్వు చెప్పే చిట్కా ఏమిటి?"

"రేపు నువ్వు మా అబ్బాయిని పెళ్లి చేసుకున్నావనుకో, అప్పుడు, మా వెర్రి నాగన్న ఆఫీసులో చొక్కాపై సిరా మరకా - పాంటుపై పెట్రోలు మరకలతో ఇంటి కొచ్చాడనుకో! ఆ మరకల్ని వదిలించేటందుకు నువ్వుపయోగించే కిటుకేంటి?!"

"నీ దగ్గరికెవరైనా వచ్చి, 'పట్టు చీరలు పాడవకుండా రంగులు జాగ్రత్తలు తీసుకోవాలని అడిగితే, వారికి నువ్విచ్చే సలహాలేంటి?"

"బియ్యంలో పురుగు పట్టకుండా వుండాలంటే నువ్విచ్చే సూచనలేమిటి?"

"గిన్నెలో కూర అడుగంటకుండా వుండేందుకు నువ్వు తీసుకునే జాగ్రత్తలేమిటి! ఒకవేళ పొరబాటున కూర మాడిపోతే దాన్ని ఎలా బాగుచేస్తావ్?"

- ఇత్యాది ప్రశ్నలన్నీ ఆమె సిద్ధం చేసుకునేది ప్రతి పెళ్లి చూపులకీ. ఎన్నో సంబంధాలకు తిరగ్గా తిరగ్గా చివరి కావిడకో చక్కని సంబంధం దొరికింది.

పిల్ల బుద్ధిమంతురాలు, బి.ఏ. హోమ్ సైన్సు చదివింది. పిల్ల తెలివి తేటలకు కొలమానం - ఆ అమ్మాయి రాసిన పుస్తకాలు.... 'గృహిణులకు చిట్కాలు', 'ఇల్లాళ్లకి చిట్కాయణం', 'పెళ్ళి కాబోయే అమ్మాయిలకు నజరానా', 'వంటలో మెలకువలు', 'పొరబాట్లూ - దిద్దుబాట్లూ', 'అక్కరకొచ్చే అవిడియాలు', 'అయిదు వేల తీపి వంటలు', 'ఆరువేల కారం వంటలు'; 'నూనె లేకుండా వేపుళ్లు', 'పాలు లేకుండా పాయసాలు', 'పంచదార లేని షర్బత్‌లు'; 'పచ్చళ్లూ వాటి ప్రాశస్త్యం', ఇలా ఒకటేమిటి ఎన్నో గ్రంధ రాజాల్ని పబ్లిష్ చేసింది. అవన్నీ మధురమైన చాక్లెట్లలా మార్కెట్లో అమ్ముడవుతున్నాయి.

ఆ పిల్ల ముందు శ్యామలాంబగారికి తన ప్రశ్నావళిని విప్పవలసిన పని లేకపోయింది. ఎగిరి గంతేసి, ఆ అమ్మాయిని తన ఇంటి కోడల్ని చేసేసుకుంది.

ఆ తర్వాత.........

"అయ్యో! నా మతి మరుపుమండ! అమ్మాయ్! ఓ కోడలు పిల్లా! పొరబాటున కంది పప్పు, శనగపప్పు కలిపేశానమ్మా ఈ రెంటినీ ఎలా వేరు చెయ్యాలో నాకు తెలీదు. ఆ కిటుకేమిటో నువ్వే చూడాలమ్మాయ్!" అంది శ్యామలాంబ.

మరో రోజు.....

"వెధవ కళ్లు సరిగ్గా కనిపించి చావలేదమ్మా! పొరపాటున కాఫీ పొడీ - టీ పొడి కలిపేశాను. వాటిని విడదీసే ఐడియా నీదే!" అంది.

ఇంకో రోజు.....

"ఎప్పుడూ మతిమరుపే! టేబుల్ సాల్టుని పంచదారలో కలిపేశానమ్మా నువ్వే ఆలోచించాలి. దీన్ని ఎలా వాడాలో" అంది.

ఇలా అత్తగారు కావల్నిగా చేస్తున్న 'అలవాట్లలోని పొరబాట్లను' సర్దుకోలేకపోతున్న కోడలు పిల్ల తెలివైంది కాబట్టి, "అత్తయ్య గారూ! మీకెందుకి శ్రమ హాయిగా కృష్ణా, రామా అనుకుంటూ కూచోక. అన్ని పనులూ నేను చూసుకుంటానులెండి," అని చెప్పి వంటిల్లుని కైవసం చేసుకుంది.

ఒకరోజు అత్తగారు గాభరాగా అరుస్తూ కోడల్ని పిలిచారు.

"ఏమైందత్తయ్యా?" అంటూ పరుగునొచ్చింది కోడలు.

"కొంప మునిగిందమ్మాయ్! ఈ సీసాలో మందుంది చూశావ్? దీన్ని డాక్టరు గారు సీసాను బాగా కదిపి ఒక చెంచాడు రోజూ సేవించమన్నారు. సీసా కుదపడం మర్చిపోయాను. ఇప్పుడేం చేసేది?!" అని అడిగింది అత్తగారు.

"మ్రారేం గాభరాపడకండత్తయ్యా! ఒక్క నిముషం మీరిలా వచ్చి ఉయ్యాల బల్ల మీద పడుకోండి," అంది కోడలు.

అత్తగారు కోడలు చెప్పినట్లు చేసి, కోడలేం చేస్తుందోనని చూస్తున్నారు. ఎంతైనా కోడలు అతి తెలివైన పిల్ల. గబగబా ఉయ్యాల బల్లనో నాలుగైదూపులూపింది.

"ఇదేమిటి? ఉయ్యాల మీంచి పడిపోతానే తల్లీ" అందా కంగారుగా అత్త.

"ఇంకేం ఫరవాలేదత్తయ్యా! మీరు సీసాని కుదపకపోయినా నేను మీ కడుపులోని మందును కుదిపేశానత్తయ్యా!" అంది అమాయకంగా నటిస్తూ కోడలు.

ఇంకా నయం డాక్టరు గారు ఈ మందును వేడిచేసి తాగమనలేదు. అప్పుడైతే ఈ తెలివైన కోడలు పిల్ల నన్ను తిన్నగా స్టవ్ పైకెక్కించేదే అనుకుంది అత్తగారు. అంతే ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ కోడల్ని బాధించే ఈ చిట్కాయణాల పరీక్ష జోలికి పోలేదావిడ!